క్లుప్తంగా

పరామర్శ



చంద్రమౌళిని పరామర్శిస్తున్న విక్రాంత్

పాలకొండ: పట్టణంలోని నక్కలపేటలో నివాసం ఉంటున్న ఒప్పంగి చంద్రమౌళిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. చంద్రమౌళి తల్లి అమ్మయ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ఓదార్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, బాసూరు కాంతారావు, కిల్లారి మోహనరావు, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, ఎద్దు లిల్లీపుష్పనాథం, కోడెం విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



సూరిబాబును అభినందనలు తెలియజేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇ.సూరిబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకునిగా పనిచేస్తున్న ఈయనకు ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయనకు కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి



మాట్లాడుతున్న ఎంఈఓ గౌరినాయుడు

వీరఘట్టం: విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ – 1 డి.గౌరినాయుడు సూచించారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా 1, 2 తరగతుల పిల్లలు చూసి రాయడం, చదవడం నేర్చుకునేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. బోధనలో మెలకువలు పాటించి చిన్నారులను ఆకట్టుకోవాలని సూచించారు. సమావేశంలో కాంప్లెక్ చైర్మన్ బి.సాంబర, కె.పోలినాయుడు, అన్ను వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని టిక్కబాయి గ్రామంలో శనివారం చేపట్టిన తనిఖీల్లో ఎనిమిది మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం



వీరఘట్టం బార్నాలవీధిలో గణేష్ నిమజ్జనంలో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న యువత

వీరఘట్టం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని బార్నాల వీధి, సెగిడివీధితో పాటు పలు వీధుల్లో కొలువుదీరిన వినాయకులను శనివారం సాయంత్రం స్థానిక ఒంటిగెడ్డలో నిమజ్జనం చేశారు. అంతకుముందు విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డుపైనే నీరు..



పాలకొండ రూరల్: పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడవ్వడంతో చిన్నపాటి వర్షానికి కూడా రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన కూడా పడ్డారు. అధికారులు స్పందించి నీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కలుపు నివారణే కీలకం

- వరిలో కలుపుమొక్కల నివారణతో మేలు
- పంట బాగా పెరగడంతో పాటు అధిక దిగుబడులు

గుమ్మలక్ష్మీపురం:



బెల్లిడి సమీపంలో వరి పంటలో కలుపుమొక్కలు తీస్తున్న మహిళా రైతు

వరి సాగులో కలుపు నివారణ కీలకమైనది. సకాలంలో పంటలో కలుపుతీత చేపట్టకపోతే నష్టం తప్పదని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రధాన పంటమొక్కలు మినహాయించి ఇతర గడ్డిరకాల మొక్కలను కలుపుమొక్కలుగా చెప్పుకోవచ్చు. అయితే వీటిని పంట నుంచి వేరు చేయకపోతే పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు పంటలో పెరిగిన కలుపుమొక్కలను ఏరివేస్తే ప్రధాన పంటమొక్కలు ఏపుగా పెరగడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని సలహా ఇస్తున్నారు. అలా కాకుండా కలుపుమొక్కలను అలాగే ఉంచితే నేల నుంచి ప్రధాన పంటకు అందాల్సిన పోషకాలన్నీ ఇవే తీసుకుని, పంట ఎదగకుండా ఉంటుంది. దీనికితోడు తెగుళ్ల బెడద కూడా తెచ్చిపెడుతుంది.

పంటకు హాని కలిగించేవి ఇవే..

పంటకు హాని కలిగించే కలుపు మొక్కల్లో ప్రధానంగా ఊదర, వెడల్పాకు, తుంగ మొక్కలు సహా ఏక వార్షిక గడ్డిజాతి మొక్కలు ఉంటాయి. వీటి నివారణకు సాధ్యమైనంత వరకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేర క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలి. సాధారణంగా రైతులు పొలాల్లో నిర్ణీత సమయంలో కూలీలతో కలుపును తీయించేవారు. ఇప్పుడు కూలీల కొరత ఎక్కువ కావడంతో పాటు కూలి రేట్లు అధికంగా ఉండడంతో రైతులు కలుపుతీతకు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలుపుమొక్కలను అంతం చేసేందుకు అనేక రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. ఈ క్రమంలో హెర్బిసైడ్ వంటి అనేక మందులు మార్కెట్‌లో ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. అయితే వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించకుండా రసాయన మందులు వినియోగించినా నష్టమేనని చెబుతున్నారు. దీనిపై రైతులకు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సలహా ఇస్తున్నారు.

కలుపును ఇలా నివారించాలి..

వరిసాగులో కలుపుమొక్కల నివారణకు ప్రత్యేక క్రిమిసంహారక మందులను వినియోగించాలి. వరి నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లో ప్రైటిలాకోర్ ద్రావణం 500 మిల్లీలీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 20 గ్రాముల మందును నీటిలో కరిగే గుళికలతో మిశ్రమం చేసి చల్లాలి. పెట్‌సల్ఫ్యూరాన్ లేదా క్లోరీమ్యూరాన్ ఈథేల్ ఎనిమిది గ్రాముల మందును కలిపి రెండు నుంచి నాలుగు ఆకుల దశలో కలుపు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. కలుపు నాలుగు ఆకుల దశలో ఉన్నప్పుడు బిస్పైరీబాక్ సోడియంను ఎకరాకు 100 మిల్లీలీటర్ల మందును పిచికారీ చేయాలి. పెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని 900 మిల్లీలీటరును పిచికారీ చేస్తే అన్నిరకాల కలుపుమొక్కలు నిర్మూలించబడతాయి. అయితే ఇవి ఏ సమయంలో వేయాలన్న విషయాలను వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకోవాలి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించాలి. దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనాలు వేసుకున్న దగ్గర నుంచి కలుపుమొక్కల నివారణ వరకు ప్రతి దశలోనూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోవాలి లేకుంటే పంట దెబ్బతింటుంది.

–పి.శంకరరావు, మండల వ్యవసాయాధికారి, గుమ్మలక్ష్మీపురం

సమస్యలు పరిష్కరిస్తాం..

- ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చిరంజీవి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ చిరంజీవి

పాలకొండ: స్థానిక ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని సూపరింటెండెంట్ కె. చిరంజీవి తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవలే ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టానని, ఇక్కడ సమస్యలు పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల ఆస్పత్రిలో గర్భిణి మృతి చెందిన విషయంలో సిబ్బంది తప్పులేదని స్పష్టం చేశారు. వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

పాలకొండ రూరల్: నగర పంచాయతీ కార్యాలయం వద్ద గల రక్షిత పథకం పాడైన నేపథ్యంలో ఆదివారం తాగునీటి సరఫరా ఉండదని కమిషనర్ రత్నంరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 9 నుంచి 18 వార్డులకు సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- న్యాయమూర్తి హరిప్రియ



పాలకొండ రూరల్: మాట్లాడుతున్న న్యాయమూర్తి హరిప్రియ



నల్లరాయిగూడలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాణి

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా సమాజంలో ధైర్యంగా ముందుకు సాగవచ్చని పాలకొండ మండల న్యాయ సేవాసంస్థ అధ్యక్షురాలు, న్యాయమూర్తి చందక హరిప్రియ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో శనివారం స్థానిక ట్రైబుల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల బాలికలు, మహిళల రక్షణ కోసం రూపొందించబడిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, చిన్నవయస్సులో గర్భధారణ వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఈమె వెంట ఎస్సై కె.ప్రయోగమూర్తి, న్యాయవాదులు వెంకటేశ్వరరావు, రామ్మోహనరావు, శివదాస్, తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధ వహించాలి..

అంతకు ముందు స్థానిక సబ్ జైల్‌ను న్యాయమూర్తి హరిప్రియ సందర్శించారు. అక్కడి రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతూ.. వారికి అందుతున్న న్యాయపరమైన సేవలపై ఆరా తీశారు. సమస్యలుంటే ఫిర్యాదులు రాసి సంబంధిత పెట్టెలో వేయాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఖైదీలకు అందిస్తున్న ఆహారం, కల్పిస్తున్న వసతులు, వారి ఆరోగ్య తనిఖీలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జైలర్ రమణయ్య, హెడ్ వార్డర్ విజయ్‌కుమార్, హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

అనవసర విషయాలకు దూరం..

భామిని: అనవసర విషయాలకు దూరంగా ఉంటూ, ప్రశాంత వాతావరణంలో గడపాలని న్యాయమూర్తి రాణి సూచించారు. మండలంలోని నల్లరాయిగూడ శనివారం నిర్వహించిన న్యాయమూర్తి మాట్లాడుతూ.. నేరపూరిత విషయాల్లో తలదూర్చి కేసుల్లో చిక్కుకోవద్దని హితవు పలికారు. అనంతరం వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బత్తిలి ఎస్సై జి.అప్పారావు, ప్రజాప్రతినిధులు బిడ్డిక గయాంతి, జామి ప్రభాకర్, కె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



నేరడిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



గరుగుబిల్లి: అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రావివలస గ్రామంలో ఉన్న వినాయక మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

భామిని: మండల వ్యాప్తంగా వినాయక మంటపాల వద్ద ఉత్సవాల సందడి కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మహా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నేరడి, భామిని గ్రామాల్లోని గణపతి మంటపాల వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాలు శనివారం మధ్యాహ్నం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

సక్రమంగా సర్వే చేపట్టాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

గరుగుబిల్లి: స్వమిత్వ సర్వే సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని రాయిందొరవలస సచివాలయం పరిధిలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను ఆమె శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. భూములు, ఇళ్లకు సంపూర్ణ హక్కులు కల్పించేందుకే ఈ సర్వే చేయడం జరుగుతోందని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా చేరుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని తెలిపారు.

కేజీబీవీలో నియామకాలు ఎప్పుడో..?

- ఎదురుచూస్తున్న అభ్యర్థులు
- జోరుగా పైరవీలు జరుగుతున్నట్లు ఆరోపణలు

వీరఘట్టం:



వీరఘట్టంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టైప్–4 కేజీబీవీ

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన టైప్–4 కేజీబీవీలో నియామకాలు ఎప్పుడు చేపడతారా అని దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇక్కడ పనిచేసేందుకు మండలంలోని వీరఘట్టం, నడుకూరు గ్రామానికి చెందిన మహిళలు మాత్రమే అర్హులని అధికారులు స్పష్టం చేశారు. ఒక వార్డెన్ పోస్టుతో పాటు బాలికలకు ట్యూషన్ చెప్పేందుకు ఒక ట్యూటర్‌ను, కుక్కు, హెల్పర్, స్వీపర్, నైట్ వాచ్‌ఉమెన్‌లను నియమించేందుకు ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తు సమయం కూడా ఈనెల 16తో ముగిసింది. దీంతో వార్డెన్ పోస్టుకు ఏడుగురు, ట్యూటర్‌కు నలుగురు, హెడ్ కుక్, అసిస్టెంటు కుక్ పోస్టుకు 8 మంది, స్వీపర్, నైట్ వాచ్‌ఉమెన్ పోస్టుకు ముగ్గురు ఇలా మొత్తం 22 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తు గడువు ముగిసినా ఇంతవరకు ఈ నియామకాలపై అధికారులు ఎటువంటి ప్రకటన చేయకపోవడంపై దరఖాస్తుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ పోస్టుల కోసం పైరవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

సమాధానం కరువు..

జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వీరఘట్టంలో త్వరలో ప్రారంభించనున్న టైప్–4 కేజీబీవీలో వివిధ పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తులను బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంకు అందించాలన్నారు. అయితే ప్రకటన చేసింది సమగ్ర శిక్ష అధికారులు కాగా.. దరఖాస్తులు స్వీకరించింది హెచ్‌ఎం. పోస్టుల భర్తీ గురించి వీరిని అడిగితే ఎవ్వరి దగ్గరా సరైన సమాధానం లేదు. ఇదే విషయాన్ని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ తేజేశ్వరరావు వద్ద ప్రస్తావిస్తే మండల స్థాయిలో ఎంపికలు పూర్తి చేసి జాబితా తమకు పంపిస్తే ఆమోదిస్తామని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వీరఘట్టం టైప్–4 కేజీబీవీలో పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

జామ మొక్కల పంపిణీ



జామ మొక్కలు పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్లు

సీతంపేట: హార్టికల్చర్ ద్వారా వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధి రేగులుగూడ, గూడగుడ్డి, ఎగువ ద్వారబంధం గ్రామాల రైతులకు శనివారం జామ మొక్కలు పంపిణీ చేశారు. మొత్తం 44 మంది రైతులకు 710 మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ.. మొక్కలను నాటి సంరక్షించుకుని ఆదాయం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్లు ఎస్.ఆనందరావు, పి.నాగేశ్వరరావు, ఎస్.రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కేవీకే, గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి

పాచిపెంట : కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని కృషి విజ్ఞాన కేంద్రం (రస్తా కుంటుబాయ్) గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమా జ్యోతి అన్నారు. పాచిపెంట వ్యవసాయ శాఖ కార్యాలయంలో గిరిజన మహిళల ఆర్థిక అభివృద్ధికి పలు సూచనలు సలహాలను అందించారు. కుటుంబం ఆర్థికంగాగాని, సామాజికంగాగాని అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర ఎంతో అవసరం అన్నారు. పది మంది గిరిజన మహిళలు వస్తే వారికి చిరుధాన్యాలు వాటి ఉత్పత్తుల విలువల పెంపు అలాగే అటవీ ఉత్పత్తులకు విలువల జోడింపు వంటి పలు అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. గ్రామైక్య సంఘం ద్వారా లేదా మండల సమాఖ్య ద్వారా కృషి విజ్ఞాన కేంద్రానికి దరఖాస్తులు పెట్టుకోవచ్చని తెలిపారు. చింతపండు బ్లాక్‌ల తయారీ తేనెటీగల పెంపకం చిరుధాన్యాలతో కురుకురే బిస్కెట్లు తయారీ వంటి వాటిపై కూడా పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తామని చెప్పారు. చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో కె.తిరుపతిరావు శతాభి సర్పంచ్ రామయ్య వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● వినాయకుడికి 108 రకాల నైవేద్యం..



నీలమ్మ కాలనీలో కొలువైన గణనాథునికి భక్తులు సమర్పించిన 108 రకాల నైవేద్యాలు



గణపతి వ్రతాల్లో నిమగ్నమైన మహిళలు, భక్తులు

విఘ్నాలు తీర్చే ఉండ్రాల స్వామికి భక్తులు 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. పాలకొండ నీలమ్మ కాలనీలో కొలువుదీరిన గణపతి మంటపంలో శనివారం రాత్రి ప్రత్యేక పూజలు చేపట్టి, వివిధ రకాల ప్రసాదాలు స్వామికి సమర్పించడంతో పాటు ఏకకాలంలో వందలాది మంది మహిళలు గణపతి వ్రతాలు చేపట్టారు.

– పాలకొండ రూరల్

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న తహసీల్దారు జయ

కురుపాం: ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని తహసీల్దారు కె.జయ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వాయుపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తహసీల్దారు జయ, పార్వతీపురం ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి బి.సుభాష్ కలిసి ప్రారంభించారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ చాలామందిలో రక్తం దానం చేస్తే సన్నబడిపోతాం..ఆరోగ్యం దెబ్బతింటుందన్న అపోహలు ఉన్నాయన్నారు. రక్తం దానం చేయడం వల్ల ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. మనమిచ్చే రక్తం ఆపదలో ఉన్న వారిని కాపాడుతుందన్న విషయం తెలుసుకోవాలన్నారు. శిబిరానికి 50 మంది వచ్చి రక్తం దానం చేశారు. కార్యక్రమంలో కురుపాం సీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ బి.అనిల్, వ్యాపారవేత్త కొత్తకోట రవీంద్రకుమార్, వాయుపుత్ర సేవా సంఘం సభ్యులు బోటు అనిల్‌కుమార్, జి.ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజలో పాల్గొన్న భక్తులు

వీరఘట్టం: పట్టణంలోని కూరాకులవీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణా సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు.ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య 108 మంది దంపతులు పాల్గొని పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా 68 ఏళ్లుగా లక్షపత్రి పూజ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం

మక్కువ: పాత పోస్టాఫీస్ వీధిలో సర్పంచ్ రామలక్ష్మి పర్యవేక్షణలో సీసీ రోడ్లు, కాలువల పనులను శనివారం ప్రారంభించారు. పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, రోడ్డుకి ఇరువైపులా కాలువల నిర్మాణం చేపట్టారు. సర్పంచ్ రామలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు.